క్లుప్తంగా

ఎస్‌ఎంసీ చైర్మన్ బాబూరావుకు సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న ఏఐఎం నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన పెండెం బాబూరావును అంబేడ్కర్ ఇండియా మిషన్(ఏఐఎం) ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కేబీఆర్‌జే ప్రసాద్, ఎస్‌పీ ప్రసాద్‌రాజు, తురకా రాజు, ఇంటి ఫ్రాన్సిస్, నేలటూరి రమేష్, చిన్నయ్య, జాన్పాల్, దారా జాషువా, లూర్దయ్య, పాస్టర్ స్వరూప్, రామారావు, రత్నం, రాంప్రసాద్, స్టాలిన్, నాని ఉన్నారు.

ఆదర్శప్రాయుడు తల్లం బ్రహ్మయ్య

అమరావతి: కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం, ఆశయాల కోసం నిరంతరం పనిచేసిన కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య భావితరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తారని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో తల్లం బ్రహ్మయ్య సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అధ్యక్షత వహించారు. పాశం రామారావు మాట్లాడుతూ తల్లం బ్రహ్మయ్య తన జీవితమంతా కమ్యూనిష్టు సిద్ధాంతాల కోసం ఆశయాల సాధనకోసం పనిచేశారన్నారు. భవిష్యత్‌లో బ్రహ్మయ్యను ఆదర్శంగా తీసుకుని సీపీఎం. కార్యకర్తలంతా పేదల అభివృద్ధి కోసం నిరంతరం పాటుబడాలన్నారు. ఈసభలో సీపీఎం నాయకులు గంజిమాల రవిబాబు, యూటిఎఫ్ సీనియర్ నాయకులు గుంటుపల్లి కోటేశ్వరరావు, సయ్యద్ మోహిద్దీన్‌లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు గాదె బాలరెడ్డి మృతి



రెంటచింతల: రెంటచింతల సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె బాలరెడ్డి(89) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఆయన రెంటచింతల పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడ పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి అనుచరుడిగా, సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు పొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. బాలరెడ్డి మృతిపై ప్రభుత్వ విప్, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఫోన్లో విచారం వ్యక్తంచేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు అల్లం ప్రతాప్‌రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నాయకులు గాదె కిరీటిరెడ్డి, అల్లం ఇన్నారెడ్డి తదితరులు బాలరెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

నేడు రంగా విగ్రహావిష్కరణ

గురజాల: వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యుడు జి.సురేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వంగవీటి రాధా పాల్గొంటారన్నారు. పార్టీలకతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

పిడుగురాళ్ల: యువత క్రీడలపై శ్రద్ధ చూపాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినీత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో భారత వనిత వారపత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్‌బాల్ టోర్నమెంట్ ఏడో రోజు పోటీలకు యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినీత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై ప్రతి ఒక్కరు మక్కువ చూపించాలన్నారు. మొదటి మ్యాచ్‌లో భార్గవ సీసీ, కొండమోడు వివేకానంద సీసీ మధ్య మ్యాచ్ జరగా కొండమోడు వివేకానంద సీసీ గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో మనోజ్ సీసీ, లైమ్ సిటీ జట్లు తలపడగా మనోజ్ సీసీ విజయం సాధించగా, మూడవ మ్యాచ్‌లో దాచేపల్లి, జానపాడు జట్ల మధ్య పోటీ జరగ్గా జానపాడు జట్టు విజయం సాధించింది. వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీ, నాయక్, నిరంజన్, వెలిశల గంగాధర్ రావు(నాని), రత్నం, రవి, వీరయ్య తదితరులు ఉన్నారు.

ఏలేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విజయపురిసౌత్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుణ్యక్షేత్రమైన ఏలేశ్వర స్వామి ఆలయానికి అనుపు నుంచి పర్యాటక లాంచీల్లో శనివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అర్చకుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి 12గంటలకు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు.

హరనామస్మరణతో మార్మోగిన అమరారామం



బాలచాముండేశ్వరిదేవి అమ్మవారు



పవిత్ర కృష్ణానదిజలాలతో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన దేవాలయం ఓం నమశివాయః పంచాక్షరి నామంతో మార్మోగింది. అలాగే స్వామివారిని దర్శించుకోవటానికి శనివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజామున 4గంటలకే ఆలయంలో అభిషేకాలు మొదలుపెట్టారు. అప్పటికే క్యూలైన్లలో ఉన్న భక్తులకు ప్రథమ దర్శనం కల్పించారు. పది గంటలకు భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు పవిత్ర కృష్ణానది జలాలతో స్నానమాచరించి అమరేశ్వరాలయంలో దీపాలు వెలిగించి స్వామి వారికి ఏకరుద్రాభిషేకాలను, అమ్మవారికి కుంకుమార్చనలను నిర్వహించారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్‌లలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆరున్నర గంటల వరకు సుమారు రెండువేలకుపైగా ఏకరుద్రాభిషేకాలను నిర్వహించటం విశేషం. స్వామి వారు లింగాకారంగా ఉద్భవించిన లింగోద్భవ కాలంలో ఆలయ అర్చకులు, వేదపండితులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి ఒంటిగంటకు ఎదుర్కోల మహోత్సవాన్ని, కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఆలయ అధికారులు ఉచిత ప్రసాదాన్ని, తాగునీటిని అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 20వేల మంది వరకు భక్తులు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించినట్లు సమాచారం. పోలీసులు, దేవదాయశాఖ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సేవాసంఘాల సభ్యులు మొత్తం ఐదువందల మంది భక్తులకు సేవలందించారు.



ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఆశీర్వదిస్తున్న అర్చకులు



అమరేశ్వరుని దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులు



భరతనాట్యం చేస్తున్న కళాకారిణులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా అమరావతి అమరేశ్వరాలయంలో వి.శ్రీవాణి భాగవతారిణీచే పార్వతీకల్యాణం హరికథ, విజయవాడ జంగం మనీషా చక్రవర్తి బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తిభజన కార్యక్రమాలు సైతం భక్తులను అలరించాయి

అమరేశ్వరుని దర్శించుకున్న ప్రముఖులు..

ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరుని మంగళవారం మహాశివరాత్రి సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి కృపాసాగర్, సమాచార హక్కు కమిషన్‌లు శ్రీనివాస రావు, జనార్ధన్, జిల్లా జడ్జి పార్థసారథి స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆలయ అర్చకులు అమరేశ్వర స్వామికి, బాలచాముండేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫిట్ ఇండియా పోటీలకు సత్తెనపల్లి కేవీ విద్యార్థులు



జొన్నలగడ్డ అను



రమావత్ పార్థవి సాయినవ్యశ్రీ

సత్తెనపల్లి: ఫిట్ ఇండియా రాష్ట్రస్థాయి పోటీలకు సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థినులు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.కిరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రతి ఏడాది క్రీడా సంబంధమైన మరియు ఫిట్నెస్‌కు సంబంధించిన అంశాలలో నిర్వహించే ఫిట్ ఇండియా క్విజ్‌కు దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్షల్లో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థినులు ఇద్దరు ఎంపికయ్యారు. పాఠశాలలో పదవతరగతి చదువుచున్న జొన్నలగడ్డ అను 4వ ర్యాంక్, తొమ్మిదవ తరగతి చదువుతున్న రమావత్ పార్థవి సాయినవ్యశ్రీ 19వ ర్యాంక్ సాధించి తరువాత స్థాయి పరీక్షకు ఎంపికైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి స్టేట్‌రౌండ్‌కి 16 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

శని త్రయోదశి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో శనేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శనిత్రయోదశి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని గంగా పార్వతి నగరేశ్వర స్వామి దేవాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో శనేశ్వర పూజలు జరిగాయి. వివిధ దేవాలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

హరహర మహదేవ శంభో శంకర..



విశేష అలంకరణలో నర్సింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి వారు



దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో పూజల్లో మంత్రి అంబటి రాంబాబు, ఆయన సతీమణి విజయలక్ష్మి

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: హరహర మహా దేవ శంభో శంకర అంటూ భక్తులు పరమేశ్వరుడిని ఆరాధించారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తుల రాకతో శనివారం కిటకిటలాడాయి. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికి అక్కడ ముందస్తుగానే క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్ లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, అమ్మిశెట్టి వారి వీధిలోని త్రికోటేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్ లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజర య్యారు. ఆలయాల్లో గోత్రనామాలతో అభిషేకాలు, గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేపట్టారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. అచ్చంపేట రోడ్ లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సతీమణి అంబటి విజయలక్ష్మితో పాటు పార్టీ నాయకులు హాజరయ్యారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ వెంకటేశ్వరరెడ్డి మంత్రి అంబటి రాంబాబు దంపతులను సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, తదితరులు హాజరయ్యారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అచ్చంపేట రోడ్ లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలకు భక్తులు పోటెత్తారు. అంతేకాక లింగోద్భవ కాల దర్శనం, శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి శాంతి కళ్యాణం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం అటవీ ప్రాంతం పరిధిలో ఉన్న గుడిబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. పాపాయపాలెం గ్రామంలో గల బుగ్గ మల్లేశ్వరస్వామిని దర్శించేందుకు గ్రామస్తులతో పాటుగా వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బెల్లంకొండలోని నాగేశ్వర, గౌతమేశ్వర శివాలయంలో పండుగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలను చేపట్టారు. వెంకటాయపాలెంలో గల అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామికి గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలలో గల ఆలయాలలో ప్రభలు ఆకట్టుకున్నాయి. పాపాయపాలెం గ్రామంలోని బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయ ఆవరణం ప్రభలతో నిండిపోయింది. గ్రామంలోని యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభలు భక్తులను ఆకట్టుకున్నాయి. శివుని ప్రతిమలతో ప్రభలను అందంగా అలంకరించారు.

క్రోసూరులో...

క్రోసూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం మండలంలోని గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రోసూరు, దొడ్లేరు, ఊటుకూరు, బయ్యవరం, పీసపాడు, 88త్యాళ్లూరు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రమైన క్రోసూరులోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



వెంకటాయపాలెంలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు

నకరికల్లులో...

నకరికల్లు: దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన చేజర్ల గ్రామంలోని కపోతేశ్వరస్వామి ఆలయంలోను, నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలోను మరకతలింగేశ్వరస్వామి ఆలయంలోను, నకరికల్లు, గుండ్లపల్లి, దేచవరం గ్రామాల్లోని మల్లేశ్వరస్వామి దేవస్థానాల్లోను శనివారం మహాశివరాత్రి సందర్భంగా విశేషపూజలు చేశారు. చేజర్లలోని కపోతేశ్వరస్వామి కల్యాణవేడుకల్లో భాగంగా సుప్రభాతసేవ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అభిషేకాలు చేశారు. బలిహరణ, రుద్రహోమం, గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి నాలుగు వాహనాలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో విశేష అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించు నేందుకు వచ్చిన భక్తులు ఆలయాలు కిక్కిరిశాయి. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పలు గ్రామాలలోని శివాలయాలలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేకువజామునుండే భక్తులు శివాలయాలకు క్యూ కట్టారు. చామర్రులోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో చండీయాగం, శాంతి కల్యాణ యాగాలు నిర్వహించారు. పలు గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిమ్మిశెట్టి సాంబయ్య బృంద సభ్యులు భజన కార్యక్రమాలు చేపట్టారు. గో పూజలు చేశారు. మాదిపాడులోని నందులరేవుకు సమీపంలోని శివాలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను మహాశివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివార్లకు తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముప్పాళ్లలోని కాశీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయం, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి, దమ్మాలపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి, కుందురువారిపాలెంలోని సాందీపని ఆశ్రమంలోను స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న శివాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు కాశీవిశ్వేస్వర మరకతలింగంను దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు.



పట్టణంలోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో పూజల్లో భక్తులు



పట్టణంలోని శివాలయంలో కిటకిటలాడుతున్న భక్తులు



ప్రత్యేక పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరస్వామి



బ్రాహ్మణపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పక్కా గృహాలపై సంపూర్ణ హక్కు పొందండి

ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి



సంపూర్ణ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, సర్పంచి వీరబాబు

అచ్చంపేట: ఓటీఎస్ విధానం ద్వారా పక్కా గృహాలపై సంపూర్ణ హక్కు పొందేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చక్కటి అవకాశాన్ని కల్పించారని ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్‌ఎస్సార్కే సాయిరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని సచివాలయం-1 పరిధిలో ఓటీఎస్ ద్వారా రుణాలు చెల్లించిన 90మంది లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచి కంబాల వీరబాబు అధ్యక్షత వహించారు. సాయిరెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం హయాంలో జరగని విధంగా లబ్ధిదారులు రుణ విముక్తులయ్యేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. ఉప సర్పంచ్ షేక్ జాని, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, ఓటీఎస్ లబ్ధిదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



అదుపుతప్పి పంటకాలువలో దూసుకెళ్లిన కారు

నకరికల్లు: అదుపుతప్పిన కారు పంటకాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులకు ప్రాణహాని తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన మండలంలోని దేచవరంకుంట సమీపంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి.. కారంపూడికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కారులో గుంటూరుకు బయలుదేరారు. మార్గంమధ్యలో నర్సింగపాడు ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి బయలుదేరారు. దేచవరంకుంట సమీపంలోకి వచ్చేసరికి వాహనం నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండడంతో కారు అదుపుతప్పి కుడివైపున రోడ్డుపక్కనే ఉన్న పంటకాలువలోకి దూసుకెళ్లింది. దాదాపు 50మీటర్ల మేర కాలువనీటిలోకి దూసుకెళ్లింది. గమనించిన సమీపంలోనివారు కారులోని ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలుకాలేదు. కారులో అందరూ క్షేమంగా భారీప్రమాదం నుంచి బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అడిగొప్పలలో పారిశుద్ధ్య పనులు



ముమ్మరంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

దుర్గి: మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న సైడు కాల్వలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయించి గ్రామంలో స్వచ్ఛతకు, శుభ్రతకు శ్రీకారం చుట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి దష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సంబంధిత విషయంపై చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దానిలో భాగంగా డ్రైనేజీ వాటర్, పాడైపోయిన కాల్వలను, కచ్చా డ్రైన్‌లను ఏర్పాటు చేసి డ్రైనేజీ వాటర్‌కు అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేశారు. వడ్డెర బజారు వద్ద గల కొత్త సచివాలయం బిల్డింగ్ వరకు సైడ్ కాల్వ పూడిక తీసి దుర్గి వైపు గల ఈద్గా వరకు ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు మార్జిన్, బుష్ క్లియరెన్సు, రోడ్డు ఎడమ వైపున ఫుట్ ఎక్స్‌టెన్షన్‌ను చేశారు. మొత్తం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ ప్రభ విరిగిపడి కార్మికుడికి గాయాలు



విద్యుత్ ప్రభ మధ్యకు విరిగిన దృశ్యం

రెంటచింతల: జెట్టిపాలెం గ్రామానికి చెందిన భక్తులు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ప్రభ మధ్యలో విరిగి ప్రభను నిర్మిస్తున్న ఓ కార్మికుడుపై పడి గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సయ్యద్ షమీర్‌బాష తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సత్రశాల దేవస్థానం ఆవరణలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యుత్ ప్రభను నిర్మిస్తుండగా, అక్కడ పనిచేస్తున్న కార్మికుడు శ్యామ్‌పై ప్రభ విరిగి పడడంతో గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడైన శ్యామ్‌ను ఏపీ జెన్‌కో అంబులెన్స్ వాహనంలో మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాష తెలిపారు.

21న జిల్లా పరిషత్ దుకాణాల వేలం

గురజాల: ఈ నెల 21వ తేదీన బస్టాండ్ ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ షాపింగ్ దుకాణాల వేలం నిర్వహించడం జరుగుతుందని ఎండీపీఓ ఫణికుమార్ తెలిపారు. మొదటి అంతస్తుపై గల 5 దుకాణాలకు మాత్రమే వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలన్నారు.